సేవా మణి'హారం' స్కార్ఫ్

భారత స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరడమే గౌరవంగా భావిస్తారు.. అలా స్కౌట్స్ ఉద్యమంలో చేరేందుకు ఆసక్తి ఉన్నవారిని, గౌరవనీయ వ్యక్తులను ఆహ్వానిస్తూ స్కార్ఫ్ (కండువా)ను మెడలో వేయడం ద్వారా స్కౌట్‌ను విస్తృతం చేయడమే లక్ష్యంగా ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 1న స్కార్ఫ్ డే నిర్వహిస్తారు. వివిధ దేశాల్లో వారి వారి సంస్కృతి సంప్రదాయాలను తెలియజేయడంతో పాటు స్కౌట్స్‌కు, గైడ్స్‌కు వేర్వేరుగా స్కార్ఫ్‌లు అందజేస్తారు.



- నేడు ప్రపంచ స్కౌట్ స్కార్ఫ్ డే
- స్కౌట్ ఉద్యమంలోకి ఆహ్వానించేందుకు ప్రత్యేక కండవాతో ఉత్సవం



ఆర్ఐఓకు స్కార్ఫ్ వేస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రతినిధులు (ఫైల్)



భారత స్కౌట్స్ గైడ్స్ ప్రాంతీయ శిక్షణా కేంద్రం



స్కార్ఫ్ ధరించి శిక్షణలో పాల్గొన్న గైడ్స్

వైవీయూ : విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జాతీయ సమైక్యత, జట్టుకృషి అలవర్చేలా విద్యార్థిదశ నుంచే సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించేలా శిక్షణ ఇచ్చే సంస్థ 'భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్'. ఇలాంటి సంస్థల్లో ప్రవేశం పొందడమే గౌరవంగా భావిస్తారు. స్కౌట్స్ అండ్ గైడ్స్‌గా చేరిన ప్రతి ఒక్కరూ స్కార్ఫ్ ధరించడం తప్పనిసరి. అదే విధంగా యూనిఫాంలో లేని సమయంలో స్కౌట్ సభ్యుడిగా గుర్తింపు పొందేందుకు స్కార్ఫ్‌ను వినియోగిస్తారు. కొత్తగా ఎవరైనా ఇందులో ప్రవేశం పొందడం, అతిథులుగా విచ్చేసిని వారిని స్కౌట్ ఉద్యమంలోకి ఆహ్వానిస్తూ వారి మెడలో ఆభరణంలా స్కార్ఫ్‌ను వేస్తారు. అధికారులను, ప్రజాప్రతినిధులను, గౌరవనీయ వ్యక్తులను సంస్థ ద్వారా గౌరవించేందుకు ఈ స్కార్ఫ్‌ను వినియోగిస్తారు. స్కార్ఫ్ అందజేసే రంగులను బట్టి వారి హోదాను తెలుసుకోవచ్చు. 1907 ఆగస్టు 1 వతేదీన స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిఫాంకు జతచేయడంతో స్కార్ఫ్ డేగా నిర్వహిస్తారు.

జిల్లాలో సేవలు..

స్కౌట్స్ అండ్ గైడ్స్ (బీజీఎస్) దేశంలో 1907లో మేజర్ బెడెన్ పావెల్ చేతుల మీదుగా ప్రారంభం కాగా, కడప జిల్లాలో 1930లో ప్రారంభమైంది. అనంతరం రెండుగా ఉన్న స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్‌లు 1950లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌గా రూపాంతరం చెందింది. అప్పట్లో కడప నగరానికి చెందిన దాత రావుబహదూర్ వెంకటశేషం శెట్టి 2.25 ఎకరాల స్థలాన్ని స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు ఉచితంగా అందజేశారు. దీంతో 1937లో అప్పటి కలెక్టర్ హెజ్‌మాడీ ప్రస్తుతం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉన్న భవనాన్ని నిర్మించాడు. కాగా నూతనంగా ఏర్పాటైన స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యవర్గం భవనాలకు కొత్తరూపు తీసుకువచ్చారు. జిల్లాలో స్కౌట్స్ అండ్ గైడ్స్ విపత్తులు, కార్యక్రమాలు, ఎన్నికల సమయాల్లో విధులు నిర్వహిస్తూ మన్ననలు పొందుతున్నారు.

గౌరవంగా భావిస్తాం



స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరిన ప్రతి ఒక్కరూ స్కార్ఫ్‌ను ధరించడాన్ని గౌరవంగా భావిస్తాం. ఎవరైనా అతిథులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు విచ్చేసిన సమయంలో వారి మెడలో స్కార్ఫ్‌ను వేసి గౌరవిస్తాం. స్కౌట్ ఉద్యమంలోకి ఆహ్వానించడమే స్కార్ఫ్ ధరించడం ముఖ్య ఉద్దేశ్యం.

- డి. ప్రమీలాదేవి, జిల్లా కార్యదర్శి, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, వైఎస్ఆర్ కడప జిల్లా

స్కార్ఫ్ రంగులను బట్టి హోదా గుర్తింపు



భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో స్కార్ఫ్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంది. స్కార్ఫ్ ధరించడం ద్వారా స్కౌట్స్ అండ్ గైడ్స్‌గా గుర్తించబడుతారు. దీంతో పాటు వారు వేసుకున్న రంగుల స్కార్ఫ్‌ను అనుసరించి వారి హోదాను గుర్తించవచ్చు. స్కౌట్స్‌లోకి ఆహ్వానించేందుకు స్కార్ఫ్‌ను వినియోగిస్తాం.

- బి. శివశంకర్‌రెడ్డి, జిల్లా కోశాధికారి, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, వైఎస్ఆర్ కడప

విలువలకు చిహ్నం



స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో స్కార్ఫ్ ధరించడాన్ని ఎంతో గౌరవంగా భావిస్తాం. సమాజసేవతో పాటు నాయకత్వ లక్షణాలు నేర్పుతారు. స్కార్ఫ్‌ను రక్షణకు, విలువకు చిహ్నంగా భావిస్తాం.

- సుచరిత, గైడ్ విద్యార్థిని, జెడ్పీహెచ్ఎస్, కమలకూరు

స్కార్ఫ్ ధారణతో గుర్తింపు



విద్యార్థిదశలో స్కార్ఫ్ ధరించడం ద్వారా స్కౌట్స్ అండ్ గైడ్స్‌గా ప్రత్యేక గుర్తింపును ఇస్తుంది. శిక్షణలో స్కార్ఫ్ ధరించడం, వాటి వర్ణాల విశిష్టతను తెలియజేస్తారు.

- మయూరి, గైడ్ విద్యార్థిని, జెడ్పీహెచ్ఎస్, మైదుకూరు

పదోన్నతి తేదీ కామన్‌గా ప్రకటించాలి



డీఈఓ కార్యాలయ ఏడీకి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ఉన్నతీకరణలో భాగంగా భాషోపాధ్యాయులైన తెలుగు, హిందీ, ఉర్దూ, వ్యాయామ ఉపాధ్యాయులు పాఠశాల సహాయకులుగా పదోన్నతి పొంది భిన్న రకాలైన తేదీలలో జాయిన్ అయినట్లుగా నమోదు చేసుకున్నారని, దీనిని సవరించి అందరికీ ఒకే తేదీ కామన్‌గా ప్రకటించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కోరారు. ఈ విషయమై బుధవారం డీఈఓ కార్యాలయ పరిపాలనాధికారి మునీర్ ఖాన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 నవంబర్ 1వ తేదీ నుండి 4వ తేదీ వరకు భాషోపాధ్యాయులకు ఉన్నతీకరణ పదోన్నతులు కల్పించారన్నారు. అయితే పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు నవంబర్ ఒకటవ తేదీ నుండి నాలుగో తేదీ వరకు వివిధ తేదీలలో చేరడం వలన బదిలీల సమయంలోనూ, పదోన్నతుల్లోను కొంతమేర స్పష్టత కొరవడి సీనియార్టీ విషయంలో ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. డీఈఓ ఈ విషయాన్ని పరిశీలించి అందరికీ 2019 నవంబర్ ఒకటో తేదీని కామన్ సీనియార్టీగా ప్రకటిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు రవికుమార్, జిల్లా కార్యదర్శి ఏజాస్ అహమ్మద్, నాయకులు బత్తుల చంద్రశేఖర్, గాజులపల్లి గోపీనాథ్, యడాల సురేష్ కుమార్ పాల్గొన్నారు.

కేసు నమోదు

కడప అర్బన్ : ఆటో చోరీ జరిగిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. కడప నగరంలోని ఆరోగ్యమాత చర్చి సమీపంలో లగేజీ ఆటో (ఏపి04యుఏ 0105)ను జూలై 10 వ తేదీన రాత్రి డ్రైవర్ శ్రీనాథ్ పార్క్ చేసి ఉంచాడు. మరుసటి రోజున ఆటో లేదు. గుర్తు తెలియని వ్యక్తులు ఆటో చోరీ చేసుకుని వెళ్లారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేద్దామంటే ఆటో యజమాని గోర్ల నాగరాజుకు ఆరోగ్యం సరిగా లేదు. దీంతో అతడి అక్క సుజాత పోలీసులకు ఫిర్యాదు చేసింది. డ్రైవర్ శ్రీనాథ్ యజమాని వద్ద ఆటో అద్దెకు తీసుకుని పాల వ్యాపారం చేసేవాడు. ఈ క్రమంలో ఆటో చోరీకి గురైంది. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ భాస్కర్‌రెడ్డి కేసు నమోదు చేశారు.

మీ సేవలు చిరస్మరణీయం



పదవీ విరమణ చేసినవారిని సన్మానిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ లోసారి సుధాకర్

కడప అర్బన్ : దాదాపు 35 సంవత్సరాల పాటు అంకితభావంతో పోలీసుశాఖకు అందించిన సేవలు శాఖ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జూలై నెలాఖరున పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులను అదనపు ఎస్పీ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ కుటుంబ జీవితాన్ని త్యాగం చేసి నిబద్ధతతో విధులు నిర్వర్తించినందుకు పోలీసుశాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు. పదవీ విరమణ తరువాత కుటుంబ సభ్యులతో గడుపుతూ ఆరోగ్యంపై దృష్టి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ ఏఓ జ్యోతి, ఆర్ఐ టైటస్, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్ పాల్గొన్నారు. పదవీవిరమణ సన్మానం పొందిన పోలీసు అధికారులలో ప్రొద్దుటూరు ఒన్‌టౌన్ ఏఎస్ఐ ఎం. కొండారెడ్డి, మైదుకూరు ఎస్ఐ సి.వి రమణ ఉన్నారు.

ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర రవాణా, క్రీడా, యువజనులశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని కోరారు. బుధవారం ఈ మేరకు వారు మంగళగిరి పార్టీ కార్యాలయంలో మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ గంగాంజనేయులు మాట్లాడుతూ ఆర్టీసీలో 7300 మంది కార్మికులు కాంట్రాక్ట్ వ్యవస్థ థర్డ్ పార్టీ విధానంలో పనిచేస్తున్నారు. థర్డ్ పార్టీ విధానం వల్ల కార్మికులు చాలా నష్టపోతున్నారని తెలియజేశారు. ఈ విధానాన్ని రద్దు చేసి, నేరుగా సంస్థ నుంచి జీతం వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన అప్కాస్‌లో ఆర్టీసీని కలపాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ముత్యాలరావు, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ గజపతి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ పీజీ సెట్ రద్దు చేయాలి



వైవీయూలో నిరసన తెలుపుతున్న ఆర్‌వీఎస్ నాయకులు, విద్యార్థులు

వైవీయూ : ఏపీ పీజీ సెట్‌ను రద్దు చేసి, విశ్వవిద్యాలయాలు సెట్లు నిర్వహించుకునే స్వేచ్ఛ ఇవ్వాలని రాయలసీమ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి మల్లేల జగదీష్ డిమాండ్ చేశారు. బుధవారం విశ్వవిద్యాలయంలో ఆర్‌వీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకీకృత పీజీ ప్రవేశ పరీక్షల వల్ల విద్యాసంవత్సరం సరైన సమయానికి ప్రారంభమై, నిర్ణీత కాలంలో ముగియడం లేదన్నారు. తద్వారా పీజీ స్థాయిలో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ భారీగా తగ్గిపోతోందన్నారు. అదే విధంగా పీజీ సెట్‌కు సంబంధించిన సమాచారం కూడా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు చేరడం లేదన్నారు. యూజీ డిగ్రీకి సంబంధించిన పరీక్షా ఫలితాలను వివిధ విశ్వవిద్యాలయాలు విభిన్న సమయాలలో ప్రకటిస్తుంటాయని, దీనివలన సెట్‌కు సంబంధించిన కౌన్సిలింగ్ కూడా ఆలస్యం అవుతుందన్నారు. కావున విశ్వవిద్యాలయాలే సెట్ నిర్వహించుకుని ప్రవేశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌వీఎస్ నాయకులు దిలీప్, భార్గవ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొత్త కమిషనర్‌ను నియమించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : గత కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్ వారం రోజుల కిందట రిలీవ్ అయినప్పటికీ కడప నగరపాలక సంస్థకు వెంటనే కొత్త కమిషనర్ ను నియమించడంలో ప్రభుత్వం తాత్సారం చేయడం తగదని సీపీఐ కడప నగర కార్యదర్శి యస్.వెంకట శివ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెల 20వ తేదీన ప్రభుత్వం ప్రకటించిన ఐఏఎస్ అధికారి తేజ్ భరత్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించని నేపథ్యంలో మరో ఐఏఎస్ అధికారికి బాధ్యతలు అప్పజెప్పేందుకు ప్రభుత్వం వెంటనే చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు.

ప్రజా ప్రయోజనాలు లేని కేంద్ర బడ్జెట్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రజా ప్రయోజనాలు లేని బడ్జెట్‌గా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెల ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పూర్తి బడ్జెట్ అంకెల వెనుక, ప్రజల ప్రయోజనాలు లేవని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామ్మోహన్ పాల్గొన్నారు.

కేరళ మృతులకు సంతాపం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : విద్య, వైద్యంలో అగ్రగామి రాష్ట్రం గాను, పుష్కలమైన నీరు, పచ్చని పొలాలతో నిత్యం కళకళలాడే కేరళలోని వయనాడు జిల్లాలో అనూహ్య వరదల కారణంగా వందలాదిమంది మరణించడం బాధాకరమని ఆర్‌సీపీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు మడగలం ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో కేరళలో ప్రకృతి వైపరీత్యాలు, వరదల వల్ల చనిపోయిన మృతులకు ఆర్‌సీపీ నాయకులు సంతాపం ప్రకటించారు. మృతులకు కేంద్ర ప్రభుత్వం రూ. 10 లక్షల నష్టపరిహారాన్ని చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ నాయకులు రవి పాల్గొన్నారు.

టోకెన్ నంబర్లను పునః సమీక్షించాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలోని ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబంధించిన ప్రావిడెంట్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్, డీఏ అరియర్స్, పీఎఫ్ అడ్జస్ట్‌మెంట్‌లకు సంబంధించి డీడీఓల ద్వారా బిల్లు చేసిన టోకెన్ నంబర్లను ఒక సారి పునః సమీక్షించాలని ఎస్టీయూ నేతలు కోరారు. రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు బాలగంగి రెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ బాష, సంగమేశ్వర్ రెడ్డి తదితరులు ఈ విషయమై కడప డిప్యూటీ ట్రెజరర్ వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.

కలెక్టర్ కలిసిన ఏపీ హంస నాయకులు

కడప రూరల్ : జిల్లా నూతన కలెక్టర్ గా విచ్చేసిన శివ శంకర్‌ను ఏపీ హంస నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసి వారిలో ఏపీ హంస కడప జిల్లా ప్రెసిడెంట్ బి.రాజరత్నం, కార్యదర్శి చంద్రమౌళి, ట్రెజరర్ జయప్రకాష్, వైస్ ప్రెసిడెంట్లు జయకుమార్, సీనియర్ అసిస్టెంట్ సుధీర్ కుమార్, రాజశేఖరాచారి, రాధిక, కడప సిటీ యూనియన్ సభ్యులు షణ్ముఖం, శ్రీనివాసులు, ఇంతియాజ్ ఉన్నారు.

వైవీయూ వీసీతో ఏఎఫ్‌యూ వీసీ భేటీ



వైవీయూ వీసీతో చర్చిస్తున్న ఏఎఫ్‌యూ వీసీ

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కే. కృష్ణారెడ్డిని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య జి. విశ్వనాథ కుమార్ భేటీ అయ్యారు. బుధవారం యోగివేమన విశ్వవిద్యాలయాన్ని ఏఎఫ్‌యూ వీసీ తొలిసారిగా సందర్శించారు. ఇరువురు వీసీలు కలిసి విశ్వవిద్యాలయాల అభివృద్ధి గురించి చర్చించారు. సమావేశంలో వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య రఘునాథరెడ్డి, ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రాజేష్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల సౌకర్యాల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత

వైవీయూ : విశ్వవిద్యాలయంలో చదువులు సాగించే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడటానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తానని వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం విద్యార్థులు వారికి ఎదురవుతున్న సమస్యల గురించి చర్చించేందుకు విశ్వవిద్యాలయ వసతి గృహాల చీఫ్ వార్డెన్, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డితో కలిసి పరిపాలన భవనంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమలాపురం నుంచి పెద్దపుత్త మీదుగా, అలానే చింతకొమ్మదిన్నె నుంచి విశ్వవిద్యాలయానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. వెనువెంటనే కడప డిపో మేనేజర్ కు రిజిస్ట్రార్ లెటర్ ద్వారా కోరారు. రాయలసీమ విద్యార్థి సమాఖ్య ప్రధాన కార్యదర్శి జగదీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

తగ్గుతున్న కూరగాయల ధరలు

కడప అగ్రికల్చర్ : కూరగాయల ధరలు క్రమేపీ తగ్గుముఖం పడుతున్నాయి. మొన్నమొన్న వరకు ఘాటుగా ఉన్న మిరప, అల్లం ధరలు కూడా కాసింత తగ్గుముఖం పట్టాయి. దీంతో సామాన్య జనాలకు కాసింత ఊరట లభిస్తోంది. కొద్దిరోజుల క్రితం కిలో రూ. 100 ఉన్న మిరప ప్రస్తుతం కిలో రూ. 40 చేరుకుంది. అలాగే టమాటా ధరలు కూడా కిలో రూ.70 ఉండగా ప్రస్తుతం కిలో రూ. 30 చేరింది. గతంలో కిలో రూ.200 ఉన్న అల్లం ధర ప్రస్తుతం రూ. 150 చేరింది. బీన్స్ కూడా మొన్నమొన్నటి వరకు కిలో రూ. 120 ఉండగా ప్రస్తుతం కిలో రూ. 80 చేరింది. క్యారెట్ కూడా కిలో దాదాపు రూ. 100 ఉండగా ప్రస్తుతం కిలో రూ. 80 ఉంది. కాప్సికం కిలో రూ. 70 ఉండగా చిక్కుడుకాయ కిలో రూ. 70 ఉంది. ఇక బంగాళాదుంప, కాలీఫ్లవర్ కిలో రూ. 50 ఉండగా అలసందలు కిలో రూ. 45, బీట్రూట్, దొండకాయ, వంకాయ, మట్టికాయలు, కాకరకాయ, ముల్లంగి కిలో రూ. 40, బీరకాయ, దోసకాయలు కిలో రూ. 35, బెండకాయ కిలో రూ. 20 ధరలు ఉన్నాయి.

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ముఖ్యంగా గుడ్, బ్యాడ్ టచ్‌ల పట్ల అవగాహన కలిగి ఉండాలని ప్రధానోపాధ్యాయులు మునిరత్నమ్మ సూచించారు. కడప మండలం ఆలంఖాన్‌పల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో బుధవారం గర్ల్స్ ఎడ్యుకేషన్‌లో భాగంగా విద్యార్థులకు గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. బాలికలు బయట ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1098కి కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ పురోహితుల సంక్షేమానికి కృషి

కడప కల్చరల్ : బ్రాహ్మణ పురోహితుల సంక్షేమానికి తనవంతుగా కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ పురోహిత సమాఖ్య జిల్లా ప్రతినిధులు మూర్తిరాజు, సత్యనారాయణవర్మ, వారణాశి శ్రీధర్‌శర్మలు తెలిపారు. బుధవారం విశాఖపట్టణంలోని శిల్పారామంలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ పురోహిత సమాఖ్య రాష్ట్ర, జిల్లా కమిటీ నియమకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కడప జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా మూర్తి రాజు, సత్యనారాయణ శర్మ, వారణాశి శ్రీధర్‌శర్మలను ఏకగ్రీవంగా ఎంపిక చేసి నియామక పత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన రాష్ట్ర గౌరవ అధ్యక్షులు యామీజాల నరసింహమూర్తి, తెన్నేటి సునీల్, పొదిలి నారాయణ మూర్తి తదితరులకు కృతజ్ఞతలు తెలియజేశారు.